# ఉత్తమ ఇల్లాలి గుణగణాలు

**167వ అంశం** సుహాసిని, సుమధుర భాషిణి అయిన కన్యను, భర్త మనసు చూరగొని, ఎక్కువ మంది పిల్లల్ని కనే మహిళను మనువాడండి.

● హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ సాలమ్ బిన్ ఉతబ బిన్ అదీమ్ బిన్ సాయిద అన్సారీ (రహ్మాలై) గారు తన తండ్రి నుండి, ఆయనేమో తన తాతగారి నుండి సంగ్రహించిన ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'కన్యలైన స్త్రీలను వివాహమాడండి. వారు మృదువుగా సంభాషించేవారై ఉంటారు. ఎక్కువ మంది పిల్లల్ని కంటారు. కొద్దిపాటి వస్తు సామగ్రి సమకూరినా సంతోషిస్తారు." (ఇబ్నుమాజా-1861 సహీహ్).[1]

● హజ్రత్ జాబిర్ (రజి)కథనం: మేము ఒక యుద్ధంలో దైవప్రవక్త (స) వెంట ఉన్నాము. మేము తిరుగు ప్రయాణంలో మదీనా సమీపంలోకి వచ్చినప్పుడు 'దైవప్రవక్తా (స)! నేను కొత్తగా పెళ్ళి చేసుకున్నాన'ని అన్నాను. "ఏమిటేమిటి, నువ్వు పెళ్ళి చేసుకున్నావా?" అని ఆయన(స) ప్రశ్నించారు. నేను 'అవున'న్నాను. "కన్యను చేసుకున్నావా? వితంతువును చేసుకున్నావా?" అని ఆయన(స) అడిగారు. 'వితంతువును' అని నేను చెప్పాను. "కన్యను ఎందుకు వివాహమాడలేదు? (కన్య అయివుంటే) ఆమె నీతో నువ్వు ఆమెతో ఎంచక్కా ఆడుకునేవారు కదా?" అని ఆయన (స) అన్నారు. - ఈ హదీసును బుఖారీ, ముస్లింలు పొందుపరిచారు.[2]

**168వ అంశం** భర్త ఇంట్లో లేనప్పుడు అతని ఆస్తిపాస్తులను, మాన మర్యాదలను కాపాడుతూ, భర్తకు విధేయురాలై ఉండే స్త్రీ అత్యుత్తమ ఇల్లాలు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి) కథనం : మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "అత్యుత్తమ ఇల్లాలు ఎవరంటే నీవు ఆమె వంక చూసినప్పుడు నిన్ను ప్రసన్నుణ్ణి చేయాలి. నువ్వు ఏదైనా ఆజ్ఞాపించినప్పుడు దానిని శిరసావహించాలి. నీవు లేనప్పుడు నీ సంపదను రక్షించాలి, తన శీలాన్ని కాపాడుకోవాలి."- (తబ్రానీ సహీహ్).[3]

**168(అ)వ అంశం** పిల్లలపై మమతానురాగాలు కురిపిస్తూ, భర్త వ్యవహారాలలో నిజాయితీగా మసలుకునే స్త్రీ ఉత్తమ ఇల్లాలు.

---

1. సహీహ్ సుననె ఇబ్నుమాజా, లిల్ అల్‌బానీ - మొదటి భాగం, హ.నెం.1508
2. మిష్కాతుల్ మసాబీహ్, లిల్ అల్‌బానీ- రెండవ భాగం, హ.నెం.3088
3. సహీహ్ జామె అస్సగీర్ వ జియాదతిహి, లిల్ అల్‌బానీ-మూడవ భాగం, హ.నెం.3294

teluguislam.net


హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ఒంటెలపై ప్రయాణించే మహిళలలో మంచివారు ఖురైషు మహిళలు. వారు తమ పిల్లలపై వాత్సల్యం కనబరుస్తారు. మమతానురాగాలు కురిపిస్తారు. తమ భర్తల సిరి సంపదలను రక్షించటంలో నిజాయితీ పరులై ఉంటారు." ఈ హదీసును ముస్లిం పొందుపరిచారు.[1]

## 169వ అంశం భర్త లైంగిక భావోద్రేకాలను గౌరవించే ఇల్లాలితో అల్లాహ్ ప్రసన్నుడై ఉంటాడు.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఏ శక్తి స్వరూపుని చేతుల్లో నా ప్రాణముందో ఆయన సాక్షిగా! ఎవరయినా తన భార్యను పడక మీదికి పిలిచినప్పుడు ఆమె నిరాకరిస్తే ఆకాశాలలోనున్న వాడు (అల్లాహ్) అప్రసన్నుడవుతాడు. ఆమె భర్త ఆమె యెడల ప్రసన్నుడు కానంతవరకూ (ఆకాశవాసి ప్రసన్నుడు కాడు)"- ఈ హదీసును ముస్లిం క్రోడీకరించారు.[2]

## 170వ అంశం భర్తను అమితంగా ప్రేమించే స్త్రీ ఉత్తమ సహధర్మచారిణి.

వివరణ: 10వ అంశం క్రిందవున్న హదీసును చూడండి.

## 171వ అంశం ఐదు పూటల నమాజు చేస్తూ, రమజాన్ ఉపవాసాలు పాటిస్తూ శీలవతిగా, భర్తకు విధేయురాలిగా రాణించే మహిళ అత్యుత్తమ ఇల్లాలు.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ఏ స్త్రీ ఐదుపూటల నమాజు చేస్తుందో, రమజాన్ ఉపవాసాలు పాటిస్తుందో, తన మానాన్ని కాపాడుకుంటుందో, తన భర్తకు విధేయురాలై ఉంటుందో, ఆమెతో (ప్రళయ దినాన) స్వర్గపు ఎనిమిది ద్వారాలలో కోరిన ద్వారం గుండా ప్రవేశించు అని అనబడుతుంది." - ఈ హదీసును ఇబ్ను హిబ్బాన్ సహీహ్ అని క్రోడీకరించారు.[3]

## 172వ అంశం శ్రీవారిని సంతోషపరుస్తూ, శ్రీవారికి విధేయతచూపుతూ, తన ధన ప్రాణాలను శ్రీవారికి అర్పించే శ్రీమతి ఉత్తమ సహధర్మచారిణి.

హజ్రత్ అబూహురైరా (రజి)కథనం: "ఓ దైవప్రవక్తా (స)! అత్యుత్తమ మహిళ ఎవరు?" అని ఒకరు ప్రశ్నించగా, ఆయన (స) ఇలా సమాధానమిచ్చారు: "భర్త తన వంక చూసినప్పుడు అతన్ని ప్రసన్నుణ్ణి చేసే స్త్రీ. ఏ విషయంలోనయినా ఆజ్ఞ ఇవ్వగానే శిరసావహించే మహిళ.

---

1. కితాబుల్ ఫజాయెల్: బాబు ఫీ నిసావు ఖురైషిన్
2. కితాబున్నికాహ్ : బాబు తహ్రీము ఇమ్తినావుహా మన్ ఫరాషి జౌజిహా
3. సహీహ్ జామె అస్సగీర్ వ జియాద, లిల్ అల్బానీ - మూడవ భాగం, హ.నెం.673

ఇంకా తన ధన ప్రాణాల విషయంలో భర్త ఇష్టాయిష్టాలను ఖాతరు చేస్తూ ఉల్లంఘనకు పాల్పడకుండా ఉండే వనిత." (నసాయి-3231-హసన్)[1]

### 173వ అంశం ప్రతి విషయంలోనూ పారలౌకికంగా భర్త మేలును కోరుకునే విశ్వాసురాలు ఆదర్శ ఇల్లాలు.

హజ్రత్ సౌబాన్ (రజి) ఇలా అంటున్నారు: వెండీ బంగారాన్ని కూడబెట్టడంపై హెచ్చరికతో కూడిన సూక్తి అవతరించినప్పుడు సహాబా (ర.అన్హుం) ఆందోళన చెంది, "మరి మనం ఏ సంపదను కూడబెట్టాలి?" అని చెప్పుకున్నారు. "మీ సందేహానికి సమాధానం ఇప్పుడే తెలుసుకుంటాను ఉండండి" అంటూ హజ్రత్ ఉమర్ (రజి) తన ఒంటెపై వేగంగా స్వారీ అయ్యారు. ఆయన దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరయ్యారు. నేను కూడా (సౌబాన్) ఆయన్ని అనుసరించాను. "ఓ దైవప్రవక్తా (స)! ఇంతకీ మేము ఏ సంపదను సమకూర్చు కోవాలి?" అని ఉమర్ (రజి) గారు ప్రశ్నించగా, "మీలోని ప్రతి ఒక్కరూ కృతజ్ఞతా భావం నిండిన హృదయాన్ని, ధ్యానించే నాలుకను, పరలోక సాఫల్యం విషయంలో మీకు తోడ్పడే విశ్వాసురాలైన భార్యను పొందేందుకు యత్నించాలి" అని దైవప్రవక్త (స) ఉపదేశించారు.

(ఇబ్నుమాజా-1856 సహీహ్).[2]

### 174వ అంశం ఆదర్శ ఇల్లాలు కావటానికి నాలుగు అనుసరణీయ ఉదాహరణలు.

హజ్రత్ అనస్(రజి)కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "మహిలో అత్యుత్తమ మహిళామణులు నలుగురున్నారు.

1) ఇమ్రాన్ కుమార్తె యగు మర్యమ్ (ర.అన్హా)

2) ఖువైలిద్ కుమార్తెయగు ఖదీజా (ర.అన్హా)

3) ముహమ్మద్ పుత్రికయగు ఫాతిమా (ర.అన్హా)

4) ఫిర్ఔన్ భార్య అయిన ఆసియా (ర.అన్హా)

- ఈ హదీసును అహ్మద్, తబ్రానీలు సహీహ్ అని పొందుపరిచారు.[3]

---

1. సహీహ్ సుననె నసాయి, లిల్ అల్బానీ, రెండవ భాగం, హ.నెం.3030
2. సహీహ్ సుననె ఇబ్నుమాజా, లిల్ అల్బానీ- మొదటిభాగం, హ.నెం.1505
3. సహీహ్ జామె అల్సగీర్ వ జియాదహ్, లిల్ అల్బానీ- మూడవ భాగం, హ.నెం.3323